సాక్షి వికారాబాద్

గురువారం । 11 । సెప్టెంబర్ । 2025



బానిస కావొద్దు

యువత గంజాయి, మత్తు పదార్థాల జోలికి వెళ్లరాదని ఎక్సైజ్ సీఐ సదాశివుడు సూచించారు. 8లో▸



విధి నిర్వహణలో..

విధి నిర్వహణలో బాధ్యతగా పని చేసినప్పుడే గుర్తింపు వస్తుందని యాలాల ఎస్ఐ విఠల్‌రెడ్డి అన్నారు. 8లో▸



యువ వికాసమేదీ!

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో తెచ్చిన రాజీవ్ యువ వికాసం పథకం అమలు కావడం లేదు. 9లో▸

న్యూస్‌రీల్

వీరనారి చాకలి ఐలమ్మ

అదనపు కలెక్టర్ లింగ్యానాయక్



నివాళులర్పిస్తున్న అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ ఇతర అధికారులు

అనంతగిరి: వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతిని బుధవారం కలెక్టరేట్‌లోని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఐలమ్మ చిత్ర పటానికి అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐలమ్మ చూపిన బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు) సుధీర్, ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరి, డీఆర్‌ఓ మంగ్లీలాల్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటరు, పోలింగ్ కేంద్రాల తుది జాబితా విడుదల



ఓటర్ల జాబితాను విడుదల చేస్తున్న అడిషనల్ కలెక్టర్ సుధీర్

అనంతగిరి: ఓటరు, పోలింగ్ కేంద్రాల తుది జాబితాను బుధవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్, జెడ్పీ సీఈవో సుధీర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని మండల కేంద్రాలు, గ్రామ పంచాయతీలు, కలెక్టరేట్, ఆర్డీవో కార్యాలయాల్లో అందుబాటులో ఉంచినట్లు వివరించారు. అభ్యంతరాలను పరిగనలోకి తీసుకొని మార్పులు చేయడం జరిగిందన్నారు. ఈ నెల 8న తాండూరులో జరిగిన మండల స్థాయి రాజకీయ పార్టీ ప్రతినిధుల సమావేశంలో లేవనెత్తిన అభ్యంతరాలను పరిశీలించి, రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం మార్పులు చేయడం జరిగిందన్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆయా కార్యాలయాల్లో పరిశీలించవచ్చని తెలిపారు.

శివసాగర్ ప్రాజెక్టును పరిశీలించిన అధికారులు



ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

యాలాల: మండలంలోని నాగసముందర్ గ్రామ పరిధిలో గల శివసాగర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ప్రాంతాన్ని ఇరిగేషన్ అధికారులు బుధవారం పరిశీలించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కాకరవేణి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. కాగా విశ్వనాథ్‌పూర్ సమీపంలో నిర్మాణంలో ఉన్న శివసాగర్ ప్రాజెక్టు కారణంగా వరద నీరు భారీగా నిలుస్తోంది. దీంతో నాగసముందర్ రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఇరిగేషన్, పంచాయతీ రాజ్ అధికారులను బ్యాక్ వాటర్ నిలిచే ప్రాంతాన్ని పరిశీలించి, సమస్య పరిష్కారానికి గల అవకాశాలను పరిశీలించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ కిష్టయ్య, పీఆర్ డీఈ కృష్ణ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే లక్ష్యం

డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి



గ్రామ కమిటీ సభ్యులను సన్మానించిన మండల నాయకులు

కుల్కచర్ల: పేదల అభ్యున్నతే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్ అన్నారు. బుధవారం మండలంలోని పుట్టపహడ్‌లో గ్రామ కమిటీను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఎన్నికల హామీలన్నీ అమలు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం పుట్టపహాడ్ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కుర్మయ్య, ప్రధాన కార్యదర్శిగా నాగేశ్వర్ గౌడ్, ఉపాధ్యక్షుడిగా సర్వర్ పాషా, యువజన విభాగం అధ్యక్షుడిగా రాఘవేందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు హరినాథ్ రెడ్డి, నాయకులు వెంకట్రాములు, అంజిలయ్య, జలీల్, భరత్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేతన వెతలు..

కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు నెలనెలా అందని జీతాలు

- నాలుగు నుంచి ఎనిమిది నెలలుగా ఇదే పరిస్థితి
- హెల్త్, ఎడ్యుకేషన్, డీఆర్డీఏ శాఖల్లో వందలాది మంది ఎదురుచూపులు
- అప్పు చేసి కుటుంబాలను నెట్టుకొస్తున్న వైనం



ఇటీవల విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళికి వినతిపత్రం అందజేస్తున్న గెస్ట్ లెక్చరర్లు

వికారాబాద్: ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు వేతన బాధలు తప్పడంలేదు. నాలుగు నుంచి ఎనిమిది నెలల ఆలస్యంగా ఇస్తున్నారు. గతంలో ఈ సమస్య అప్పుడప్పుడు ఉండేదని.. ప్రస్తుతం మరింత పెరిగిందని అంటున్నారు. రెగ్యులర్ ఉద్యోగులకు కూడా వారం నుంచి పది రోజుల ఆలస్యంగా జీతాలు అందుతున్నట్లు తెలిసింది. డీఆర్డీఏ, ఆరోగ్య, విద్యాశాఖల్లో వందలాది మంది కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్నారు. సరిగ్గా జీతాలు రాక కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలనెలా అప్పులు చేయాల్సి వస్తోందని తెలిపారు. ఎనిమిది నెలలుగా వేతనాలు అందడం లేదంటూ ఇటీవల గెస్ట్ లెక్చరర్లు ఆందోళన బాటపట్టారు. వికారాబాద్‌కు వచ్చిన విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళికి వినతిపత్రం కూడా అందజేశారు.

ఆ మూడు శాఖల్లో..

జిల్లాలోని డీఆర్డీఏ, వైద్య, విద్యా శాఖల్లో ఎక్కువ మంది కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పని చేస్తున్నారు. ఒక్కో శాఖలో 200 నుంచి 800 మంది వరకు పని చేస్తున్నారు. ఒక్క వైద్యఆరోగ్య శాఖలోనే దాదాపు 800 మంది వరకు విధులు నిర్వహిస్తున్నారు. నాలుగు నెలలుగా వీరికి వేతనాలు అందడం లేదు. వీరిలో కాంట్రాక్టు వైద్యులు మొదలుకుని ఏఎన్ఎంలు, జూనియర్ ఏఎన్ఎంలు, స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్టులు వంటి వారు ఉన్నారు. విద్యా శాఖలోనూ దాదాపు 750 మంది కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నారు. వీరికి కూడా నెలనెలా జీతాలు రావడం లేదు. గతంలో రెండు నుంచి మూడు నెలల తర్వాత ఇచ్చేవారు. ప్రస్తుతం నాలుగు నుంచి ఎనిమిది నెలలుగా రావడం లేదని తెలిపారు. ఇందులో మండల విద్యావనరుల కేంద్రాల్లో విధులు నిర్వహించే నాన్ టీచింగ్ స్టాప్, కేజీబీవీల్లో విధులు నిర్వహించే నాన్ టీచింగ్ స్టాఫ్ ఉన్నారు. సీఆర్‌పీలు, ఎంఐఎస్‌లు, పీటీఐలు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఐఈఆర్పీలు ఉన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో విధులు నిర్వహించే గెస్ట్ లెక్చరర్లు సైతం ఎనిమిది నెలలుగా అవస్థలు పడుతున్నారు. ఇక డీఆర్డీఏ శాఖలో కాంట్రాక్టు ప్రాతిపదికన విధులు నిర్వహిస్తున్న 200 మందికి జీతాలు అందక అవస్థలు పడుతున్నారు. వీరిలో అటెండర్లు, సీసీలు, ఏపీఓలు, టీఏలు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఏపీఎంలు తదితరులు ఉన్నారు.

అప్పు పుట్టడంలేదు

నాలుగు నుంచి ఎనిమిది నెలలుగా జీతాలు రాక అవస్థలు పడుతున్నామని ఆయా శాఖల కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు తెలిపారు. ప్రతి నెలా అప్పు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం అప్పు కూడా పుట్టని పరిస్థితి వచ్చిందని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రతినెలా వేతనం అందేలా చూడాలని వారు కోరుతున్నారు.



అమ్మచెరువు పరిశీలించి మాట్లాడుతున్న సత్యనారాయణరెడ్డి

అమ్మచెరువును అభివృద్ధి చేస్తాం

- మినీ రిజర్వాయర్‌గా తీర్చిదిద్దుతాం
- నారాయణపేట – కొడంగల్ ఎత్తిపోతలతో సస్యశ్యామలం
- ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ సత్యనారాయణరెడ్డి

దౌల్తాబాద్: నారాయణపేట – కొడంగల్ ఎత్తిపోతల పథకంతో కొడంగల్ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ శ్రీధర్ అన్నారు. బుధవారం దౌల్తాబాద్ మండలం ఈర్లపల్లి గ్రామంలోని అమ్మ చెరువును పరిశీలించారు. ఈ చెరువును మినీ రిజర్వాయర్‌గా అభివృద్ధి చేస్తామన్నారు. ఇక్కడ 3 టీఎంసీల నీటిని నిల్వ చేయడానికి ప్రతిపాదనలు సిద్ధమైనట్లు వివరించారు. ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే సాగునీటికి ఇబ్బందులు ఉండవని, రైతులు ఆర్థికంగా ఎదగుతారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ పథకంపై ప్రత్యేక దృష్టి పెట్టారని.. రానున్న మూడున్నర ఏళ్లలో పథకాన్ని పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్, నాయకులు శరణయ్య, మాధవరెడ్డి, వెంకట్రామరెడ్డి, సాయిలు, శ్యామరెడ్డి, వెంకట్రాములు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండండి

- పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- జిల్లా పంచాయతీ అధికారి జయసుధ



హెల్త్ క్యాంప్‌ను పరిశీలించి వైద్యులతో మాట్లాడుతున్న డీపీఓ జయసుధ

దుద్యాల్: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి డాక్టర్ పీ జయసుధ సూచించారు. బుధవారం మండలంలోని పోలేపల్లి, హకీంపేట్, ఈర్లపల్లి గ్రామాల్లో పర్యటించారు. పోలేపల్లిలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపును పరిశీలించారు. వ్యాధులు ప్రబలకుండా చూడాలని హకీంపేట్, దుద్యాల్ వైద్యులు వందన, విద్యకు సూచించారు. అనంతరం గ్రామంలోని ప్రధాన వీధులను పరిశీలించారు. మురుగు కాలువల్లో చెత్తాచెదారం ఉండటాన్ని చూసి వెంటనే శుభ్రం చేయాలని ఆదేశించారు. ప్రజలు పంచాయతీ వాహనాల్లోనే చెత్త వేయాలన్నారు. అనంతరం గ్రామంలో దోమల నివారణ మందును పిచికారీ చేయించారు. ఆ తర్వాత అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులతో ముచ్చటించారు. హకీంపేట్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈర్లపల్లి గ్రామంలో పోలింగ్ స్టేషన్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మహేశ్ కుమార్, ఎంపీవో సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు మోహన్, ఆనంద్, సూర్య ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆహార భద్రత మన బాధ్యత



కోట్‌పల్లి పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

ఫుడ్ సేఫ్టీ కమిషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

బంట్వారం: విద్యార్థులు, చిన్నారులు, గర్భిణులకు నాణ్యమైన భోజనం అందించడం మన బాధ్యత అని రాష్ట్ర ఆహార భద్రత కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం ఫుడ్ కమిషన్ సభ్యులతో కలిసి కోట్‌పల్లి జెడ్పీహెచ్‌ఎస్ తోపాటు అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. పిల్లలు, విద్యార్థులకు పెడుతున్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలన్నారు. గర్భిణులు, చిన్నారులకు పౌష్టికాహారం అందించాలన్నారు. అనంతరం కోట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్య సేవలపై ఆరా తీశారు. ప్రజలకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని డీఎంహెచ్‌ఓ లలితాదేవికి సూచించారు. మాతాశిశు సంరక్షణ వివరాల నమోదును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వైద్య సిబ్బంది సేవలను ప్రశంసించారు. అనంతరం గ్రామంలోని రేషన్ దుకాణాన్ని తనిఖీ చేశారు. రేషన్ నిల్వలను ఎప్పటికప్పుడు రిజిస్టర్‌లో నమోదు చేయాలని డీలర్‌కు సూచించారు. అధికారుల ఫోన్ నంబర్లు బోర్డుపై రాయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఫుడ్ కమిషన్ సభ్యులు భారతి, శారద, ఆనంద్, డీఈఓ రేణుకాదేవి, డీఆర్‌డీఓ శ్రీనివాస్, డీడబ్ల్యూఓ కృష్ణవేణి, డీఎస్‌ఓ సుదర్శన్, జిల్లా మేనేజర్ మోహన్‌కృష్ణ, ఫుడ్ సెక్యూరిటీ ఆఫీసర్ జగన్నాథ్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ డానియల్, మెడికల్ ఆఫీసర్ మేఘన, ఎంఈఓ చంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

స్టాక్ పాయింట్ పరిశీలన

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని పౌరసరఫరాల శాఖ మండల స్టాక్ పాయింట్‌ను బుధవారం రాష్ట్ర ఆహార భద్రత కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, కమిషన్ సభ్యులు భారతి, శారద, ఆనంద్ సందర్శించారు. ఆయన వెంట డీఆర్డీఏ శ్రీనివాస్, పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి సుదర్శన్, జిల్లా మేనేజర్ మోహన్ కృష్ణ, ఫుడ్ సెక్యూరిటీ అధికారి జగన్నాథ్ ఉన్నారు. ఉదయం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ వసతి గృహానికి చేరుకున్న శ్రీనివాస్ రెడ్డికి అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ బొకే అందజేసి స్వాగతం పలికారు.

కెనరా బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ యాదగిరి

నవాబుపేట: కెనరా బ్యాంక్ సేవలను రైతులు, ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ యాదగిరి సూచించారు. బుధవారం మండలంలోని పులుమామిడి గ్రామంలో కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో గ్రామస్థాయి జన సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖాతాదారులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు . ప్రధాన మంత్రి స్కిల్ జీవన జ్యోతి బీమా యోజన ద్వారా వార్షిక ప్రీమియం రూ.436 చెల్లించి రూ.2 లక్షల జీవిత బీమా రక్షణ పొందవచ్చని తెలిపారు. ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన ద్వారా వారిక ప్రీమియం రూ.20తో రూ.2 లక్షల బీమా సదుపాయం అందుతుందని తెలిపారు. పంట రుణాలు, స్వయం సహాయక సంఘాలకు రుణాలు అందించడం జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో కెనరా బ్యాంక్ డివిజనల్ మేనేజర్ శ్రీనాథ్ రెడ్డి, పులిమామిడి బ్రాంచ్ మేనేజర్ పవన్, పంచాయతీ కార్యదర్శి నితిన్, సిబ్బంది భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న రైతులు, బ్యాంక్ ఖాతాదారులు

యూరియా సరఫరాలో విఫలం

- బీసీ కమిషన్ రాష్ట్ర మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్
- రైతులకు పండ్లు పంపిణీ



రైతులకు పండ్లు పంపిణీ చేస్తున్న శుభప్రద్ పటేల్

తాండూరు టౌన్: యూరియా సరఫరాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని బీసీ కమిషన్ రాష్ట్ర మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్ ఆరోపించారు. బుధవారం తాండూరు పట్టణంలోని ఎల్మకన్నె ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని సందర్శించారు. అక్కడ యూరియా పంపిణీని పరిశీలించారు. తెల్లవారుజాము నుంచే క్యూలో నిల్చున్న రైతులతో మాట్లాడారు. తన వంతు సాయంగా వారికి పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అన్నం పెట్టే రైతన్న పస్తులతో ఒక్క యూరియా బస్తా కోసం కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే యూరియా సరఫరా చేయాలని లేకుంటే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఆయనతో పాటు పార్టీ నాయకులు భాను, అబిద్, సాయి, మల్లేశం, శ్రీధర్, మనోహర్ తదితరులు ఉన్నారు.

యజమానికి లీజుదారుల టోకరా !

- రూ.కోట్ల విలువ చేసే వరి ధాన్యం బ్లాక్ మార్కెట్‌కు తరలించిన వైనం
- రైసుమిల్లు యజమాని ఫిర్యాదుతో నిందితులపై కేసు
- రిమాండ్‌కు తరలింపు
- కేసు వివరాలు వెల్లడించిన రూరల్ సీఐ నగేష్

యాలాల: రైసు మిల్లును లీజుకు తీసుకున్న వ్యక్తులు, ప్రభుత్వ మద్దతు ధరతో కొనుగోలు చేసిన వరి ధాన్యంను బియ్యంగా మలిచి ప్రభుత్వ గోదాంకు కాకుండా బ్లాక్ మార్కెట్‌కు తరలించి రూ.కోట్లలో సొమ్ము చేసుకున్నారు. సివిల్ సప్లయ్ అధికారులు విధించిన పెనాల్టీతో కంగుతున్న మిల్లు యజమాని ఫిర్యాదుతో లీజుదారుల భాగోతం బయటపడింది. ఈ ఘటనలో లీజుదారులపై కేసు నమోదు చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఇందుకు సంబంధించి వివరాలను తాండూరు రూరల్ సీఐ నగేష్ వెల్లడించారు. మండలంలోని చెన్నారం సమీపంలోని సర్వే నంబరు 81లో తాండూరుకు చెందిన సంగం రవీందర్‌గౌడ్ అనే వ్యక్తి కృష్ణసాయి రైస్ ఇండస్ట్రీస్ పేరిట రైసుమిల్లు ఏర్పాటు చేశారు. ఈ మిల్లును తాండూరుకు చెందిన ఆవిటి సంతోష్‌కుమార్‌కు 2022లో ఏడాదికి రూ.10లక్షల చొప్పున లీజుకు ఇచ్చాడు. మిల్లును లీజుకు తీసుకున్న సంతోష్‌కుమార్.. ప్రభుత్వ మద్దతు ధరతో కొన్న వరి ధాన్యంను మిల్లులో బియ్యంగా మార్చి ప్రభుత్వ గోడౌన్లకి తరలించాల్సి ఉంటుంది. 2022–23లో 142 క్వింటాళ్లు, 2023–24 సంవత్సరంలో 17,408 క్వింటాళ్ల ధాన్యాన్ని బియ్యంగా మార్చి పక్కదారి పట్టించాడు. ప్రభుత్వం కేటాయించిన సమయంలోపు బియ్యం సరఫరా కాకపోవడంతో సివిల్ సప్లయ్ అధికారులు మిల్లు యజమాని రవీందర్‌గౌడ్‌కు రూ.6 కోట్ల 38 లక్షల 51వేల పెనాల్టీ విధిస్తూ నోటీసు ఇచ్చారు. ఈ విషయమై రవీందర్‌గౌడ్ మిల్లు లీజుకు తీసుకున్న సంతోష్ కుమార్‌తో పాటు అతని పార్ట్‌నర్ వెంకటేష్‌ను నిలదీశాడు. తాము చేసిన తప్పును ఒప్పుకున్న వారు రవీందర్‌గౌడ్‌కు వివిధ దశల్లో రూ.5.10 కోట్ల విలువ గల మూడు చెక్కులను అందించారు. కాగా ఆ చెక్కులు కూడా ఖాతాల్లో నగదు లేని కారణంగా బౌన్స్ అయ్యాయని బాధితుడు జులై 26 యాలాల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు సంతోష్‌కుమార్, వెంకటేష్‌పై కేసు చేశారు.మంగళవారం రాత్రి నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఈ కేసులో మరిన్ని వివరాలు రాబట్టేందుకు నిందితులిద్దరిని పోలీసు కస్టడీ కోరినట్లు సీఐ తెలిపారు.

హామీలన్నీ అమలు చేస్తున్నాం

- ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి
- లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేత
- ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



కుల్కచర్ల: లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

కుల్కచర్ల: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నామని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం కుల్కచర్ల మండల కేంద్రంలో కల్యాణలక్ష్మి లబ్దిదారులకు చెక్కులు అందజేశారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పథకాలు పొందిన ఆనందం ప్రజల్లో కనిపిస్తోందన్నారు. మహిళల సంక్షేమానికి పెద్దపీట వేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, పాంబండ ఆలయ చైర్మన్ కోట్ల మైపాల్ రెడ్డి, తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి, ఎంఈఓ హబీబ్ అహ్మద్, చౌడాపూర్ ఎంఈఓ రాంచందర్, పీఆర్టీయూ మండల అధ్యక్ష కార్యదర్శులు రాఘవేందర్ రెడ్డి, బస్వరాజు, యూటీఎఫ్ మండల అధ్యక్షుడు రమేష్, తపస్ మండల అధ్యక్షుడు శ్రీనివాసులు, టీజీయూఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తిమ్మా, కేజీబీవీ ప్రత్యేకాధికారి దేవి, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లు ఆర్థికంగా ఎదగాలి

పరిగి: ముదిరాజ్‌లు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని రంగాపూర్ సమీపంలో ముదిరాజ్ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ముదిరాజ్‌ల అభ్యున్నతికి తాను నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం కూడా అండగా ఉంటుందని పేర్కొన్నారు. హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉండాలని, అప్పుడే సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు హన్మంతు ముదిరాజ్, ఆంజనేయులు, రామస్వామి, సత్యనారాయణ, సురేందర్, ఏ బ్లాక్ అధ్యక్షుడు పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత స్థానంలో నిలవాలి

విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానంలో నిలవాలని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆకాంక్షించారు. బుధవారం పట్టణంలోని నంబర్ వన్ ఉన్నత పాఠశాలలో రూ.7 లక్షల నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ బడుల్లో కార్పొరేట్ స్థాయి విద్య అందుతోందని తెలిపారు. అనంతరం మండలంలోని పేటమాదారం గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో ఎంఈఓ గోపాల్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అయాబ్, డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, పార్టీ పట్టణ అధ్యక్షుడు కృష్ణ, ఏ బ్లాక్ అధ్యక్షుడు పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేషన్ బియ్యం పట్టివేత



పోలీసుల స్వాధీనంలో రేషన్‌బియ్యం

కుల్కచర్ల: ప్రభుత్వం పేదలకు పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వ్యక్తులను పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం మధ్యాహ్నం కేశవులుకు చెందిన వాహనంలో కొంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన బాలకృష్ణ ఐదు క్వింటాళ్ల బియ్యాన్ని కుల్కచర్ల మార్కెట్‌కు తరలిస్తున్నాడు. ఈ క్రమంలో అంతారం గ్రామ శివారులో పోలీసులు పట్టుకున్నారు. బియ్యం గురించి ఆరా తీయగా.. ప్రజల వద్ద సేకరించి మార్కెట్‌లో విక్రయిస్తున్నామని తెలిపారు. సదరు వ్యక్తి మరొకరి పేరు చెప్పడంతో ఇరువురిపై కేసు నమోదు చేసి, నమోదు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్లు..



పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

బషీరాబాద్: అర్ధరాత్రి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ నుమాన్ అలీ తెలిపిన వివరాల ప్రకారం.. తాండూరు మండలం వీర్‌శెట్టిపల్లి గ్రామానికి చెందిన పరశురాములు, నరేష్‌లు ఆదివారం తెల్లవారు జామున కాగ్నానదిలో ఇసుకను నింపుకొని, బషీరాబాద్ మండలం కాశీంపూర్‌కు తరలిస్తున్నారు. ఈ క్రమంలో గస్తీలో ఉన్న పోలీసులు వాటిని పట్టుకున్నారు. ఠాణాకు తరలించి సీజ్ చేశారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

నిషేధిత గుట్కా..



పోలీసులు ఆధీనంలో గుట్కా, నిందితులు

కుల్కచర్ల: నిషేధిత గుట్కా విక్రయిస్తున్న వ్యక్తులను పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. నిషేధిత పాన్ మసాలను పాన్ దుకాణాల్లో కొందరు విక్రయిస్తున్నట్లు సమాచారం అందింది. ఈ మేరకు పోలీసులు బుధవారం పలు షాప్‌లపై దాడులు చేసి, ముగ్గురు వ్యక్తుల నుంచి గుట్కాను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.5,800లు ఉంటుందని పోలీసులు తెలిపారు.

ఆవులను తరలిస్తున్న కంటైనర్..

నందిగామ: గుట్టు చప్పుడు కాకుండా 32 ఆవులను తరలిస్తున్న ఓ కంటైనర్ వాహనాన్ని నందిగామ పోలీసులు బుధవారం సాయంత్రం పట్టుకున్నారు. ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, అనంతపూరం జిల్లా నుంచి హైదరాబాదు వైపునకు భారీ వాహనంలో ఆవులను తరలిస్తున్నారనే విషయాన్ని హిందూ జన జాగృతి సమితి కార్యకర్త రఘువీర్ సింగ్ తెలుసుకున్నారు. అనంతరం ఆయన పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు బైపాస్ రహదారిపై కాపు కాసి, వాహనాన్ని పట్టుకున్నారు. అందులోని మూగజీవాలను నగరంలోని సమర్థ గోశాలకు తరలించారు. కేసు దర్యాప్తులో ఉందని సీఐ తెలిపారు.

వివాదాలు సృష్టించొద్దు



రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ

దోమ: గ్రామ కంఠం భూముల్లో వివాదాలు సృష్టించొద్దని డీఎల్‌పీఓ సంధ్యారాణి సూచించారు. బుధవారం ఎంపీడీ గ్యామాతో కలిసి బుధవారం ఆమె బొంపల్లిలో పర్యటించారు. గ్రామ పరిసరాలను పరిశీలించి, పంచాయతీ కార్యాలయంలోని రికార్డులను తనిఖీ చేశారు.

ఎవర్నీ వదలం.. అందరిపై కేసులు

- కరన్‌కోట్ ఎస్ఐ రాథోడ్ వినోద్
- చంద్రవంచ దాడి ఘటనపై అధికారులు సీరియస్‌గా ఉన్నారని వెల్లడి



తాండూరు రూరల్: ఘర్షణకు కారకులైన వారిలో ఎవరినీ వదలమని, అందరిపై కేసులు నమోదు చేస్తామని కరన్‌కోట్ ఎస్ఐ రాథోడ్ వినోద్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడారు. మండల పరిధి చంద్రవంచ గ్రామంలో వినాయక నిమజ్జనంలో చోటు చేసుకున్న గొడవ తీవ్రస్థాయికి చేరుకుందన్నారు. సోమవారం అర్ధరాత్రి ఇళ్లల్లోకి చొరబడి, కర్రలతో దాడులు చేసుకున్నారని, ఆపేందుకు వెళ్లిన కానిస్టేబుల్ బస్వరాజ్‌పై దాడికి పాల్పడ్డారని పేర్కొన్నారు. దాడుల నేపథ్యంలో ఓ వర్గం నుంచి 27 మంది, మరో వర్గం నుంచి 18 మందిని ఠాణాకు పిలిపించి విచారణ చేపడుతున్నామని వివరించారు. దాడిలో గాయపడిన కానిస్టేబుల్ కోలుకున్నారని, ఆయనపై దాడి చేసిన వారిపై నాన్‌బెయిల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఇదే విషయమై డీఎస్పీ, ఎస్పీ సీరియస్‌గా ఉన్నారని, కానిస్టేబుల్ వద్ద ఉన్న వీడియో ఆధారంగా మరింత మందిపై కేసులు నమోదు చేయనున్నామని, అవి మూడు సెక్షన్ల కింద ఉంటాయని వివరించారు. పరస్పర దాడుల గురించి ఫిర్యాదులు అందుతున్నాయని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. ఇరు వర్గాల దాడి ఘటనలో.. ఓ వర్గంపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని మరో వర్గం పోలీసులపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం.

కానిస్టేబుల్‌పై దాడి.. రాజీకష్టం

చంద్రవంచలో సోమవారం రాత్రి జరిగిన గొడవ విషయమై కేసులు కాకుండా, రాజీ కుదుర్చుకునేందుకు పలువురు అధికార పార్టీ నాయకుడిని సంప్రదించినట్లు తెలుస్తోంది. అయితే.. ఇరు వర్గాల వారు రాజీ పడినా.. కానిస్టేబుల్‌పై దాడిమాత్రం రాజీ చేయడం కష్టమని ఆ నాయకుడు వారికి తేల్చి చెప్పినట్లు సమాచారం.

దురలవాట్లకు బానిస కావద్దు

- ఎక్సైజ్ సీఐ సదాశివుడు



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ సదాశివుడు

మోమిన్‌పేట: యువత మత్తు పదార్థాల జోలికి వెళ్లవద్దని సర్కిల్ ఎక్సైజ్ సీఐ సదాశివుడు అన్నారు. స్థానిక ఎస్సీ కాలనీలో గంజాయి, మత్తుపదార్థాల వినియోగం, కలిగే నష్టాల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దురలవాట్లకు లోను కావొద్దని సూచించారు. మత్తుకు బానిసగా మారితే శారీరక, మానసికంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, అనారోగ్యం పాలవుతారని పేర్కొన్నారు. సమాజం నుంచి చీత్కరించబడతారని హెచ్చరించారు. గంజాయి తదితర మత్తు పదార్థాలను విక్రయించినా, కొనుగోలు చేసినా శిక్ష తప్పదన్నారు. తల్లిదండ్రులు పిల్లలను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు.

వంతెనపై నుంచి పడి కూలీ మృతి



ఘటనా స్థలంలో సురేష్ మృతదేహం

తాండూరు రూరల్: రైల్వే విభాగంలో అడ్డాకూలీగా పని చేస్తున్న ఓ వ్యక్తి వంతెనపై నుంచి పడి మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధి నారాయణపూర్ రైల్వే బ్రిడ్జి వద్ద చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దేముల్ మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన దొడ్ల సురేష్(30), కొంతకాలంగా ఓ కాంట్రాక్టర్ వద్ద కూలీగా పనిచేస్తున్నాడు. బుధవారం అతనితో పాటు నారాయణపూర్‌కు చెందిన అంజీలు వాగుపై ఉన్న వంతెన పక్కన ఇనుప నిచ్చెనకు మరమ్మతు పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో ఒక్కసారిగా నిచ్చెన కింద పడింది. ఈ ఘటనలో సురేష్ తల.. బ్రిడ్జికింద పిల్లర్ల పక్కన ఉన్న రాళ్లలో ఇరుక్కొని ఊపిరి ఆడక మృత్యువాత పడ్డాడు. మరో కూలి వాగులో పడి, స్వల్పగాయాలతో బయటపడ్డాడు. విషయం తెలుసుకున్న స్థానికులు సురేష్ మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తల్లిదండ్రులు గతంలోనే చనిపోయారని, ప్రస్తుతం సురేష్ ఒక్కడే ఉంటున్నారని కొండాపూర్ గ్రామస్తులు తెలిపారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కొడంగల్ రూరల్: వ్యాసరచన పోటీలతో విద్యార్థుల్లో వ్యక్తీకరణ, లేఖన నైపుణ్యాలు మెరుగుపడతాయని ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శ్రీసత్యసాయి సేవా సమితి సౌజన్యం, కళాశాల ఐక్యూఏసీ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు ''వర్తమానంలో మన నడవడి మన భవిష్యత్తును నిర్ణయిస్తుంది'' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ పోటీల్లో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ రచనకు బంగారు పతకం అందజేస్తారని ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ టి.రాంబాబు, అధ్యాపకులు బంటు నర్సింలు, టి.రమేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

తుది జాబితా విడుదల



తుది ఓటరు జాబితాను విడుదల చేస్తున్న ఎంపీడీఓ, నాయకులు

దుద్యాల్: ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇందులో భాగంగా ఎంపీడీఓ మహేశ్ కుమార్ బుధవారం స్థానిక రాజకీయ నాయకులతో కలిసి తుది ఓటరు జాబితాను విడుదల చేశారు. మండల వ్యాప్తంగా 8 ఎంపీటీసీ స్థానాలు, ఒక జెడ్పీటీసీ స్థానానికి గాను 42 పోలింగ్ కేంద్రాలు సిద్ధం చేసినట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా 21,078 మంది ఓటర్లు ఉండగా, వీరిలో 10,830 మంది మహిళలు, 10,248 మంది పురుషులు ఉన్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీవో సత్యనారాయణ, సూపరింటెండెంట్ శ్రీనివాస్, కొడంగల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకారం వేణుగోపాల్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేరుగు వెంకటయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ ఖలీల్ పాషా, మాజీ సర్పంచ్ ఖాజా, కాంగ్రెస్ దుద్యాల్ గ్రామ అధ్యక్షుడు శ్రీశైలంగౌడ్, ఉపాధ్యక్షుడు కృష్ణ పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అంకితభావం కీలకం

- ఎస్ఐ విఠల్‌రెడ్డి



బదిలీ అయిన కానిస్టేబుళ్లతో ఎస్ఐ విఠల్‌రెడ్డి

యాలాల: విధి నిర్వహణలో అంకితభావం ఎంతో కీలకమని ఎస్ఐ విఠల్‌రెడ్డి అన్నారు. యాలాల ఠాణాలో ఐదేళ్లగా విధులు నిర్వహించి బుధవారం బదిలీపై వెళ్లిన కానిస్టేబుళ్లు వెంకటయ్య, అహ్మద్, నవీన్, నరేశ్‌ను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఐదేళ్లుగా కానిస్టేబుళ్లు ఎంతో బాధ్యతతో విధులు నిర్వహించి, శాంతిభద్రతలు కాపాడారన్నారు. పోలీసు అధికారులు ఎక్కడున్నా.. అంకితభావంతో పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. కానిస్టేబుళ్లతో పాటు ఇటీవల బదిలీపై వచ్చిన ఎస్ఐ– 2 సత్యనారాయణరాజు మరో పీఎస్‌కు బదిలీ కావడంతో ఆయనను సన్మానించారు.

చేయూత పింఛన్లు పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

అనంతగిరి: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వికలాంగులు, చేయూత పెన్షన్ దారుల పింఛన్లను ప్రభుత్వం వెంటనే పెంచాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు రామకృష్ణ, ప్రశాంత్ డిమాండ్ చేశారు. హామీ అమలు కోసం ఈ నెల 15న అన్ని తహసీల్దార్ కార్యాలయాల ఎదుట మహాధర్నా చేపట్టనున్నామని పేర్కొన్నారు. బుధవారం వికారాబాద్‌లో సమితి జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున ఆధ్వర్యంలో ఎంఎస్పీ, వికలాంగుల హక్కుల పోరాట సమితి, చేయూత పింఛన్ దారుల హక్కుల పోరాట సమితి ముఖ్య ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు రవికుమార్, కిష్టన్న, ఏసు, పుష్పరాణి, సునీత, పద్మమ్మ, సుశీల, ఇందిరమ్మ తదితరులు పాల్గొన్నారు.

అకౌంటెంట్ తప్పిదం.. జీతాలు ఆలస్యం

- మరో ఖాతాలోకి మళ్లిన నిధులు
- ఉద్యోగులకు తప్పని వేతన నిరీక్షణ

తాండూరు: జూనియర్ అకౌంటెంట్ అధికారి నిర్లక్ష్యం వలన 10 రోజులుగా విద్యుత్ సబ్ డివిజన్ పరిధి ఓఎస్ఎం సిబ్బందికి జీతాలు అందలేదు. వివరాలిలా ఉన్నాయి. తాండూరు సబ్ డివిజన్ కార్యాలయంలో జూనియర్ అకౌంటెంట్ అధికారి(జేఏఓ)గా జనార్దన్ విధులు నిర్వహిస్తున్నారు. ఏఈల వేతనాలకు ఒక చెక్, ఓఎస్ఎం ఉద్యోగులకు మరో చెక్, ఆర్టీజెన్ వారికి ఇంకో చెక్ రూపంలో మూడు చెక్కులను వారి వేతనాల కోసం బ్యాంకుకు పంపారు. ఏఈలు, ఆర్టీజెన్లకు వేతనాలు అందాయి. అయితే ఓఎస్ఎం ఉద్యోగులైన లైన్‌మెన్లు, జూనియర్ లైన్‌మెన్లు, మరి కొంత మందికి అందాల్సిన వేతనాలు ఏఈల ఖాతాలలో జమయ్యాయి. దీంతో వికారాబాద్, పరిగి ప్రాంతాల్లోని ఓఎస్ఎం ఉద్యోగులకు జీతాలు అందాయని, తమకు ఎందుకు అందలేదని పలువురు ఉద్యోగులు.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇదే విషయమై ఆరా తీయగా, అకౌంటెంట్ తప్పిదం వలనే మరో ఖాతాలోకి నిధులు వెళ్లాయని తేలింది. అయితే సదరు అకౌంటెంట్.. బ్యాంకు ఉద్యోగుల వలనే తప్పిదం జరిగిందని బుకాయించడం గమనార్హం. గురువారం సాయంత్రం వరకు ఉద్యోగుల ఖాతాల్లో డబ్బులు జమచేస్తామని ఉన్నతాధికారులు స్పష్టం చేశారు.

తహసీల్ అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు

ధారూర్: స్థానిక తహసీల్ కార్యాలయంలో రైతులు, ప్రజలను అధికారులు ఇబ్బంది పెడుతున్నారని దోర్నాల గ్రామానికి చెందిన మహిపాల్ బుధవారం కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. కార్యాలయంలో పైసలు లేనిదే ఫైలు కదలటం లేదని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి రెవెన్యూ సదస్సులలో స్వీకరించిన దరఖాస్తులను పరిష్కరించేందుకు సైతం కొర్రీలు పెడుతూ, డబ్బులు వసూలు చేస్తున్నారని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రేషన్ కార్డుల విషయంలో దళారులు దందా చేస్తున్నారని, వారి ద్వారానే రెవెన్యూ పనులు అవుతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఇళ్ల కేటాయింపులో మాదిగలకు అన్యాయం

ధారూరు: మండల పరిధిలోని కేరెళ్లికి చెందిన మాదిగలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అన్యాయం జరిగిందని పి.రాజు బుధవారం కలెక్టరేట్‌లో వినతిపత్రం సమర్పించారు. ఒకే సామాజికవర్గానికి చెందిన అనర్హులైన చాలా మందికి ఇళ్లు మంజూరు చేశారని ఆరోపించారు. గ్రామంలో మాదిగలకు కేవలం రెండు ఇళ్లు మాత్రమే మంజూరు చేశారన్నారు. ఇప్పటికైనా అర్హులైన దళితులకు ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

దంచి కొట్టిన వాన

మత్తడి పోసిన చెరువులు



అదుపు తప్పి కిందపడిన వాహనదారుడిని ఒడ్డుకు చేరుస్తున్న ప్రయాణికుడు

బషీరాబాద్: మండలంలో బుధవారం 2 గంటల పాటు వర్షం దంచికొట్టింది. దీంతో చెరువులు మత్తడి పోశాయి. మండలంలోని నవల్గా ఊర చెరువు అలుగ పారడంతో వాహనాల రాకపోకలకు ఆటంకం కలిగింది. ఓ వ్యక్తి బైక్‌పై వెళ్తూ.. అదుపుతప్పి కింద పడ్డాడు. తోటి ప్రయాణికులు అతడిని, బైక్‌ను ఒడ్డుకు చేర్చారు. మండల కేంద్రంలోని పంచాయతీ ఎదుట రోడ్డు విస్తరణ పనుల కోసం తీసిన గుంతలో నీరు చేరాయి. ఇది గమనించని ద్విచక్ర వాహనదారులు ఇబ్బంది పడ్డారు. పత్తి చేలల్లో వరద నీరు నలిచింది.

నేటి నుంచి మండల యూనిట్ ఎన్నికలు

అనంతగిరి: తెలంగాణ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 11 నుంచి ఆయా మండలాల యూనిట్ ఎన్నికలు నిర్వహించనున్నామని ఆ సంఘం జిల్లా ప్రధా కార్యదర్శి నర్సింహ్మారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 11న తాండూరు, పరిగి, 13న వికారాబాద్, కొడంగల్, 17న మోమిన్‌పేట, బషీరాబాద్, 19న యాలాల, మర్పల్లి, 21న కుల్కచర్లలో ఎన్నికలు ఉంటాయని పేర్కొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

ఇబ్రహీంపట్నం: పేకాట స్థావరంపై దాడి చేసి నలుగురిని ఎస్ఓటీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.55 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన మంగళవారం అర్ధరాత్రి పట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ఎలిమినేడు గ్రామ పరిధిలో జూదం ఆడుతున్నారన్న సమాచారం మేరకు పోలీసులు దాడులు చేశారు. జూదరులను పట్టుకొన్నారు. నగదు, నాలుగు మొబైల్ ఫోన్లు, బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

సోషల్ మీడియా ఉచ్చులో యువత



సమావేశంలో డీఎస్పీ, విద్యా సంస్థల ప్రతినిధులు

- దురలవాట్లకు లోనవుతున్న వైనం
- బాలికలపై పెరుగుతున్న లైంగిక దాడులు
- ఆందోళన కలిగిస్తున్న పోక్సో కేసులు
- డీఎస్పీ బాలకృష్ణా రెడ్డి

తాండూరు టౌన్: 'సామాజిక మాధ్యమ ప్రభావంతో యువత దురలవాట్లకు లోనవుతోంది. బాలికలపై లైంగిక దాడులు పెరిగాయి. పోక్సోచట్టం కేసులు పెరుగుతున్నాయి. వారి జీవితం అంధకారం అవుతోంది. ఆ కేసుల నివారణకు కలిసికట్టుగా కృషి చేద్దాం. వారి భవితకు బంగారు బాటలు వేద్దాం' అని డీఎస్పీ బాలకృష్ణా రెడ్డి అన్నారు. బుధవారం ఆర్యవైశ్య కల్యాణ మంటపంలో మండల విద్యాధికారులు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యువత పెడధోరణి, బాలికల అదృశ్యం, పోక్సో కేసుల గురించి చర్చించారు.

నైతిక విలువలు నేర్పించాలి

మారుతున్న కాలానికి అనుగుణంగా యువత నడవడికలో మార్పులు చోటుచేసుకుంటున్నాయని డీఎస్పీ అన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు బాలబాలికలు విద్యా సంస్థల్లోనే ఎక్కువగా ఉంటారని, వారికి విద్యా బుద్ధులతో పాటు నైతిక విలువలు, క్రమశిక్షణ, ఇతరులతో నడుచుకునే విధానం తదితర అంశాలను నేర్పించాలని సూచించారు. ఎవరైనా బాలికలు లైంగిక వేధింపులకు గురైనట్లు తెలిస్తే.. వారికి అండగా నిలిచి పోలీసుల సహాయంలో ఆకతాయిల ఆటకట్టించాలని చెప్పారు. పోక్సో చట్టం, దాని తీవ్రత గురించి విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

- ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కాంగ్రెస్
- యూరియా సమస్యను పట్టించుకోని సీఎం
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఆనంద్



బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆనంద్ తదితరులు

మర్పల్లి: ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించేవరకు విశ్రమించేది లేదని, ప్రజల పక్షాన పోరాటం చేస్తామని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో పార్టీ కార్యాలయాన్ని మండల అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మధుకర్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలో వస్తే.. ప్రజలు గోస పడతారని నాడు కేసీఆర్ చెప్పారని గుర్తు చేశారు. అనుకున్నట్లుగా నేడు అన్ని వర్గాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలలో ఏ ఒక్క పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయడంలేదని ఆరోపించారు. రైతులు ఎదుర్కొంటున్న యూరియా కష్టాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రజాసమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పార్టీ శ్రేణులపై పోలీసులు అక్రమ కేసులు పెట్టడం సరికాదన్నారు. అనంతరం పార్టీ కార్యాలయంలో చాకలి ఐలమ్మ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, యూత్ ప్రెసిడెంట్ మధుకర్, టౌన్ ప్రెసిడెంట్ గఫార్, మాజీ వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, నాయకులు రమేష్, శ్రీకాంత్, గౌస్ పాల్గొన్నారు.

రాజీతో కేసుల పరిష్కారం

- సీఐ వెంకట్
- 13న జాతీయ లోక్ అదాలత్



మోమిన్‌పేట: రాజీతో ఎలాంటి కేసులకైనా సులువుగా పరిష్కారం మార్గం లభిస్తుందని సీఐ వెంకట్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 13న జాతీయ లోక్ అదాలత్ జరగనుందని, కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సివిల్, మోటారు వాహనాల ప్రమాదాలు, కుటుంబ వివాదాలు, క్రిమినల్ కేసులు తదితర వాటిని పరస్పర అంగీకారంతో కోర్టు కేసులను అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చునని సూచించారు. ఈ కార్యక్రమాన్ని వినియోగించుకొని, సమయాన్ని, డబ్బును ఆదా చేసుకోవాలన్నారు.

పూడూరులో..

పూడూరు: పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసులు లోక్ అదాలత్‌ల ద్వారా పరిష్కరించుకోవాలని చన్గోముల్ ఎస్ఐ భరత్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 13న జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అదాలత్ నిర్వహించనున్నారని పేర్కొన్నారు. కక్షిదారులు కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

అనంతగిరిలో..

అనంతగిరి: రాజీయే రాజమార్గమని సీఐ భీమ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13న జిల్లా కోర్టు ఆవరణలో జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయ మెగా లోక్ అదాలత్‌లో కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులను సామరస్యంగా, సత్వరంగా పరిష్కరించుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం పోలీస్ అధికారులను సంప్రదించాలన్నారు.

యాలాలలో..

యాలాల: రాజీయే రాజమార్గమని యాలాల ఎస్ఐ విఠల్‌రెడ్డి అన్నారు. శనివారం జాతీయ లోక్ అదాలత్ జరగనుందని, కక్షిదారులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారని, పెండింగ్ కేసులు, పరస్పర ఒప్పందం ద్వారా త్వరితగతిన పరిష్కరిస్తారని తెలిపారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక



కాంగ్రెస్‌లో చేరిన అన్నసాగర్ గ్రామస్తులతో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

యాలాల: మండలంలోని అన్నసాగర్, గంగాసాగర్ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పార్టీ కండువా కప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై చాలా మంది పార్టీలో చేరుతున్నారని తెలిపారు. ఎన్నికల హామీలో భాగంగా ప్రతి వాగ్దానాన్ని సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేసి చూపిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సత్యనారాయణరెడ్డి తదితరులు ఉన్నారు.

చదువుతో పాటు.. ఆటలు ముఖ్యం

- ఎన్ఐఎన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ శిరీష



విజేత విద్యార్థినులతో ప్రొఫెసర్లు, ఉపాధ్యాయులు

కద్లాల్: విద్యార్థులకు చదువుతో పాటు ఆటలు ముఖ్యమేనని, శారీరక శ్రమ తప్పనిసరిగా ఉండాలని జాతీయ పౌష్టికాహార పరిశోధన సంస్థ (ఎన్ఐఎన్) అసిస్టెంట్ ప్రొఫెసర్ శిరీష అన్నారు. రోజు వారి ఆహారంలో పోషక ఆహారం తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో.. కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్, తెలంగాణ పాఠశాల విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో యంగ్ ఎర్త్ లీడర్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ పౌష్టికాహార పరిశోధన సంస్థ నిపుణులు విద్యార్థులకు పౌష్టికాహారంపై అవగాహన తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం అరుణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ప్రొఫెసర్ మాట్లాడారు. జంక్ ఫుడ్ తీసుకోవద్దని చెప్పారు. అనంతరం నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పరిశోధన బృందం వంశీకృష్ణ, సప్తదీప ఘోష్, జాన్సీ, కుజిత, యంగ్ ఎర్త్ లీడర్ ప్రోగ్రాం జిల్లా కోఆర్డినేటర్ రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి

దోమ: విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులే కీలకమని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం దోమ మండల కేంద్రంలో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించి, అవార్డులు ప్రదానం చేశారు. మారుతున్న టెక్నాలజీని అందిపుచ్చుకుని విద్యార్థులకు మెరుగైన విద్యను బోధించాలని సూచించారు. ఎంపీడీఓ గ్యామా, ఎంఈఓ తదితరులు పాల్గొన్నారు.